# ఆత్మతత్త్వము : ఆచరణ

**ప్రేమస్వరూపులారా!** అగ్నినుండి విస్ఫులింగములు వేరు కానట్లు జీవుడు బ్రహ్మనుండి భిన్నుడు కాడు. జన్మతః నిజ మానవులుగా జన్మించిన వారెందరు? జన్మించిన తరువాత మానవులైనవారెందరు? ధర్మ, కర్మ, మర్మ మెరిగి జీవించినవారెందరు? మానవత్వమనేది కేవలము ఆకారముచేతనే నిరూపింపబడేది కాదనే సత్యాన్ని గమనించాలి. బూరుగు కాయను చూచి మామిడియని భ్రమసినట్లు, వెట్టి చెఱకును చెఱకని నమిలినట్లు, పటికరాయిని చూచి కలకండ అని భ్రమించినట్లు రూపు చూసి మోసపోకూడదు. మానవత్వము కేవలము రూపములో లేదు. మానవత్వములో దైవత్వమున్నదనే సత్యాన్ని గుర్తించాలి.

జీవ బ్రహ్మములు మోక్షపర్యంతము ఏకము కానేరవు. సముద్రము చేరునంతవరకు నది నదిగానే రూపనామములు ధరిస్తుంది. సముద్రము చేరినతరువాత రూపనామములు కోల్పోయి ఏకత్వమును పొందుతుంది. జీవతత్త్వము దేహము, మనస్సు, ఇంద్రియములు, అంతఃకరణముతో కూడినంతవరకు దైవత్వమునకు భిన్నముగా ఉంటుంది. ఏకత్వమనే తత్త్వమును ప్రతి మానవుడు గుర్తించడం అత్యవసరం.

**ఆత్మతత్త్వము స్వప్రకాశమైనది**

ఆత్మతత్త్వము వస్తువులను ప్రకాశింపజేసేదే కాని, మరొక చైతన్యము చేత ప్రకాశింపబడేది కాదు. ఇది సమస్తమునకు ద్రష్ట స్వరూపము ధరిస్తుంది. వస్తుస్వరూపమును చూచిన సమయమునందు సమస్త జగత్తు కూడా దృశ్యముగా రూపొందుతుంది. కన్నులుండికూడా ఆలోచనా నిమగ్నులగుటచేత ఎదురుగా ఎవరున్నారో ఏమి చెప్పుచున్నారో వినడము గాని, చూడడముగాని జరగదు. కన్నులుకూడా దృశ్యమే. మరొక స్థితి యందు మనస్సుకూడా దృశ్యంగా రూపొందుతుంది. సర్వ సంకల్పముల చేరికే మనస్సు. 'సంకల్ప వికల్పకాత్మకం మనః ', దారముల చేరికచేత వస్త్రమెట్లున్నదో అట్లే సంకల్పములచేత మనస్సు స్వరూపమును ధరిస్తున్నది. బుద్ధికూడా మనస్సును అనుసరించియే ఉంటుంది. దేహము, మనస్సు, బుద్ధి, చిత్తము, అంతఃకరణము ఇవన్నీ ఆత్మయొక్క ఉపాధులే.

**బ్రహ్మతత్త్వమును గుర్తించినవాడే నిజమైన మానవుడు**

ఆత్మతత్త్వమునకు మార్పులుండవు. అది శుద్ధచైతన్యము. దేహమునకే చావుపుట్టుకలు, పరిణామ క్షీణములు, అభివృద్ధి అసంతృప్తులు. ఆత్మకిట్టి పరిణామములుగాని, క్షీణదశలుగాని చావుపుట్టుకలుగాని ఉండవు.

**చావు పుట్టుకలు లేనట్టి శాశ్వతుండు**
**ఆది మధ్యాంతరహితు డనాదివాడు**
**తాను పుట్టక చావక చంపబడక**
**అంతటను సర్వసాక్షియై అలరుచుండు**

కనుక, సర్వమునకు ద్రష్ట అయినటువంటి బ్రహ్మతత్త్వాన్ని ఏ వ్యక్తి గుర్తించడానికి ప్రయత్నించునో అతని జన్మమే నిజమైన మానవత్వము. కాని, ఈనాటి మానవత్వమునందు ఈ విశిష్ట పరివర్తనగాని, ప్రవర్తనగాని కనిపించుట లేదు. ఇది అజ్ఞానముయొక్క లక్షణమే.

మానవత్వములో తలచుట ఒకటి, ఆచరించుట మరొకటి జరుగుచున్నది. జీవిత సైకతములపై మానవుడు నిర్మించుకునే భ్రాంతి అనే పిచ్చుక గూళ్ళను నిర్దాక్షిణ్యముగా నేలకూల్చే పెనుభూతములు ఎక్కడి నుండో వచ్చుచున్నవి. రేకులను విప్పిన లేత మొగ్గలను నేలకూల్చే పెనుగాలులు వీచుచున్నవి. ఈ పెనుభూతముల తత్త్వమును, ఈ పెనుగాలుల తత్త్వమును మానవుడు అర్థము చేసికొనలేక తన వాంఛలయందు మాత్రమే తాను నిమగ్నుడై అజ్ఞానములో మునిగిపోతున్నాడు. కనుక, తలంచిన తలపునకు ఫలించిన ఫలితము భిన్నముగా ఉన్నది. తలంచినది తాను అనుభవించి నప్పుడే లేదా ఆచరించినప్పుడే ఫలితము తగిన రీతిగా దక్కుతుంది.

**అణుశక్తి లేని పదార్థము జగత్తున కానరాదు**

వేదము రెండు ప్రధానమైన పదములను గుర్తించినది. ఒకటి **'నిత్యము'**, రెండు **'స్వగతము'**. భూత భవిష్యత్ వర్తమానములందు మార్పుచెందని స్థితి నిత్యము. ఒక్క ప్రదేశమునందుండి సర్వత్రా జ్ఞానప్రకాశమును వ్యాపింప జేయునది స్వగతము. ఒకే సూర్యుడు ఒకే స్థానమునందుంటున్నాడు. కాని, తన ప్రకాశమును సర్వత్రా వ్యాపింపజేస్తున్నాడు. దీపము ఒక ప్రదేశము నందు ఉంటుంది. కాని, దాని ప్రకాశము ఇల్లంతా ప్రసరిస్తుంది. అదే విధముగనే ఆత్మ ఒక్కటే అయినప్పటికీ తన జ్ఞానప్రకాశమును సర్వత్రా ప్రసరింపజేస్తుంది. సూర్యునకు రెండు గుణములున్నాయి. ఒకటి ప్రకాశము, రెండు వేడి. ఆత్మతత్త్వమునకుకూడా 'ప్రకాశము', 'ప్రదీప్తము' అని రెండు శక్తులున్నాయి. వీనినే 'స్వభావము', 'స్వరూపము' అని శ్రుతులు నిర్ణయిస్తూ వచ్చాయి. స్వరూపమే 'ధర్మిభూత జ్ఞానము'. స్వభావమును 'ధర్మభూత జ్ఞానము' అని అంటారు.

ధర్మిభూతము అణుస్వరూపము. ధర్మభూతజ్ఞానము ప్రకాశవంత మైనది. దీనిని 'విభు' అని కూడా అంటారు.

**సూక్ష్మమైనట్టి అణువున సూక్ష్మమగుచు**
**మేటి వస్తువునందున మేటియగుచు**
**అంతట సర్వసాక్షియై అలరునట్టి**
**ఆత్మయే బ్రహ్మ, బ్రహ్మయే ఆత్మయగును**

ఈ అణుస్వరూపము దాని స్వభావమునుండే జగత్తంతా వ్యాపించి ఉంది. సర్వ పదార్థములందు చేరి వుంటుంది. అయితే, ఈ అణువునందు వేరొకటి చేరడానికి వీల్లేదు. ఆత్మతత్త్వముగాని, బ్రహ్మతత్త్వముగాని అణు స్వరూపములో సర్వ పదార్థములందు వ్యాపించవచ్చును. కాని, తన యందు ఏ పదార్థమూ వ్యాపించడానికి వీల్లేదు. ఏ అణువునందు ధర్మిభూతజ్ఞానము చేరి వుంటుందో ఆ పదార్థము ఆత్మస్వరూపముగా నిలుస్తుంది. ఏతావాతా సర్వపదార్థములందు ఈ అణుశక్తి వ్యాపించి వుండుటచేత సర్వ పదార్థములు ఆత్మస్వరూపములని స్పష్టమగుచున్నది.

కారణమేమనగా, ఈ అణుశక్తి లేని పదార్థము జగత్తున కానరాదు. ప్రతి పదార్థమునందు ధర్మిభూత జ్ఞానమనే అణుస్వరూపము చేరడంచేత దేహము ధర్మిభూత స్వరూపాన్ని ధరిస్తుంది. ధర్మిభూత జ్ఞానమనేదానిని ధర్మభూత జ్ఞానము క్రింద మన దేహముగా మార్చుకున్నాము. కనుక, దేహమునందు ఈ ధర్మిభూతమనే అణుశక్తి సర్వత్రా వ్యాపించి వుండుటచేత ఆత్మస్వరూపమే మానవత్వమనే సత్యాన్ని గుర్తించాలి. పదార్థములు ఎన్ని మారినప్పటికీ దీనిలోని అణుశక్తి మారడానికి వీల్లేదు.

**కారణము లేని కార్యము ఉండదు**

ఇదొక వెండి టంబ్లరు. ఇది ధర్మభూత జ్ఞానము. ఇది కార్యరూపము. దీనికి కారణస్వరూపము వెండి. కారణము లేకుండా కార్యము ఉండడానికి వీల్లేదు. స్వరూప స్వభావములు కార్యకారణ సంబంధమైనటువంటివి.

ఈ స్వరూపమును నీవు ఎన్ని విధములుగా మార్చినప్పటికీ ఇందులో ఉన్న వెండిని మార్చడానికి వీల్లేదు. అదేవిధముగా, ఏ పదార్థమైనా తీసుకోండి. ఇదొక (చేతిరుమాలు) పదార్థము. ఇందులో కూడా అణుస్వరూపమైన ధర్మభూత జ్ఞానము వుంటుంది. దీనిని కాల్చి భస్మము చేసినప్పటికీ దీనిలో భస్మమనే అణుస్వరూపము వుంటుంది. రూపములు మారినవేగాని, అణుస్వరూపమైన ధర్మి ఆత్మతత్త్వము మారలేదు. అందువల్లనే, దీనిని నిత్యము, సత్యము అని వేదములు పలుకుతూ వచ్చాయి.

ఈ దేహమనేది కూడా అనేక పదార్థములతో కూడి వుంటుంది. ప్రతి దేహమందు అనేక విధములైన పదార్థములున్నవి. రూపనామములు మారుచున్నవిగాని, అణుతత్త్వమైన ధర్మిభూత జ్ఞానమనేది మారలేదు. ప్రతి మానవునియందు యౌవనము, వార్ధక్యము అనే రూపనామములు మారుచున్నవేగాని, దివ్యత్వమైన ఆత్మతత్త్వము ధర్మిభూత జ్ఞానాన్ని ధరించి, బ్రహ్మతత్త్వముతో సర్వులయందు ప్రకాశిస్తూ వుంటుంది. మనము పదార్థముయొక్క భిన్నత్వముచేత యథార్థమును మరచి, పదార్థములోనే లీనమైపోతున్నాము.

**పదార్థమును పరార్థముగా మార్చుకోవడమే మానవత్వంయొక్క విశిష్టత**

ప్రేమస్వరూపులారా! పదార్థము ప్రధానము కాదు. ప్రతి పదార్థమును పరార్థముగా మార్చుకోవడమే మానవత్వముయొక్క విశిష్టత. బంగారము ఒకటిగా ఉండవచ్చు. నగలు వేరువేరు రూపములలో ఉండవచ్చు. అదే విధముగనే, మానవ స్వభావములు భిన్నముగా ఉండవచ్చును. కాని, అన్నింటియందున్న ఏకత్వాన్ని పరిశీలించినప్పుడు ఆత్మతత్త్వమొక్కటే అని గోచరిస్తుంది. అందరూ సమానులే. మధ్య కాలమునందే విభేదములు ఏర్పడుచున్నవిగాని, చావుపుట్టుకలు అందరికీ సమానమే. చక్రవర్తి మొదలు చండాలునివరకు పుట్టినప్పుడు ఇంత బట్టనైనా కట్టుకొని రారు. పోయే సమయమందు కించిత్తు అడ్రసైనా ఇచ్చిపోరు. ఈ రెండింటియందు సర్వుల దేహతత్త్వము ఏకత్వముగా ఉన్నప్పుడు ఆత్మతత్త్వముకూడా సమానమని చెప్పుటలో ఏమాత్రము సందేహము లేదు.

ఎవరికి ఎవరో ఎంత కాలమీ సంబంధ బాంధవ్యములు! అయితే, ఉన్నంతవరకు మన కర్తవ్యమును నెరవేర్చడము మానవత్వముయొక్క ప్రధాన ధర్మము. ఒక్కొక్క వ్యక్తి ఒక్కొక్క కర్తవ్యమును నిర్ణయించుకొన్న తరువాత దానిని చక్కగా నెరవేర్చాలి. 'ఇహమున సుఖియింప హేమతారక విద్య, పరమున సుఖియింప బ్రహ్మవిద్య'. నిజముగా సర్వమూ బ్రహ్మము నుండి పుట్టుచున్నను, ప్రపంచమంతా బ్రహ్మముపై ఆధారపడి ఉండినప్పటికీ బ్రహ్మమునకు కించిత్తైనా బాధ లేదు. పాముకు నోటియందే విషముండును. అది ఆ దంతములతోనే అనేక పదార్థములు తినును. కాని, తన విషము తనను బాధించుచున్నదా? తేలుకు తన తోకయందే విషము కలదు. అయితే, తన విషము తనను బాధించుచున్నదా? అదేవిధముగనే, దైవత్వమునకు ప్రకృతి స్వస్వరూపమైనప్పటికీ దైవత్వము దానితో ఏ సంబంధమూ లేకుండా ఉంటుంది. విషయ వాసనలు కలిగి, భ్రాంతితో నిండి సంబంధ బాంధవ్యములకు కట్టుబడిన మానవులకే ఈ బాధ గాని, ఎట్టి సంబంధమూ లేక, సర్వమూ తానే అన్న ఏకత్వముతో ఉన్న భగవంతునికి ఇట్టి బాధలెందుకుంటాయి? మనము గది చుట్టూ నూరు అద్దములు పెట్టుకుంటే నూరింటియందు మన ప్రతిబింబమే కనిపిస్తుంది. ఈ నూరు ప్రతిబింబములను చూచి నీవేమైనా భయభ్రాంతులకు గురి అవుతున్నావా? ఇవన్నీ నావేనని అనుకుంటావు. ఆవిధముగనే, ఈ దేహములనే అద్దములన్నింటిలో ప్రతిబింబించేది భగవంతుడొక్కడే.

**దేహాత్మ, జీవాత్మ, పరమాత్మలు మూడింటియందు ఒకే ఆత్మతత్త్వమున్నది**

'దేహాత్మ', 'జీవాత్మ', 'పరమాత్మ'యని శ్రుతులు మూడు విధములుగా విభజిస్తూ వచ్చాయి. ఈ మూడింటి

సంబంధమేమిటి? సముద్రమున్నది. దీనిని శ్రుతులు 'కూటస్థుడు' అనికూడా పిలుస్తూ వచ్చాయి. జలము నుండి అలలు బయలుదేరుచున్నాయి. అలలనుండి నురుగు వస్తున్నది. అలలు లేక నురుగు ఉండుటకు వీలు లేదు. జలము లేక అలలు ఉండుటకు వీలు లేదు. ఈ మూడూ ఒకదానితో ఒకటి సన్నిహిత సంబంధము కలిగి ఉన్నవి. అయితే, నురుగును అలలు అని పిలువరు. 'అలల'ను 'సముద్రము' అని పిలవరు. అదేవిధముగనే, దేహాత్మ అనేది నురుగువంటిది. ఈ పాంచ భౌతికమైన కాయము బుడగవంటిది.

**పాంచ భౌతికము దుర్బలమైన కాయంబు**
**ఎప్పుడు కూలక తప్పదెందు**
**శతవర్షముల దాక మితము చెప్పిరిగాని**
**నమ్మరాదామాట నెమ్మనమున**
**బాల్యమందో, మంచి ప్రాయమందో కాక**
**ముదిమియందో లేక ముసలియందొ**
**ఊరనో అడవినో ఉదకమధ్యంబునో**
**ఎప్పుడో విడిచేది ఎరుకలేదు**
**మరణమే నిశ్చయమ్మది మానవునకు**
**బుద్ధిమంతుడై తన దేహమున్న యపుడె**
**తన్ను తా తెలియుట ధర్మతత్త్వమరయ**
**సత్యమైనట్టి బాట శ్రీ సాయిమాట**

ఈ దేహమందు ఆత్మ అణుస్వరూపమును ధరించుటచేత దీనిని 'దేహాత్మ' అని అన్నారు. జీవాత్మ అనగా కార్యస్వరూపమును ధరించిన తత్త్వమని అర్థము. ఈ సర్వచైతన్యము సమస్త పదార్థములనూ కదిలిస్తుంది. కాని, ఆత్మ దగ్గరకు వచ్చేసరికి అణిగి మణిగి ఉంటుంది. అయితే, చైతన్యములో కూడా ఆత్మ అణుస్వరూపమును ధరించి ఉంటుంది. ధర్మిభూత జ్ఞానము, ధర్మభూత జ్ఞానము ఇందు వ్యాపించి ఉంటుంది కనుక, దీనిని 'జీవాత్మ' అని అన్నారు. ఇంక, పరమాత్మ. ఇచట ఒక చిన్న విషయాన్ని గుర్తించుకోండి. 'దేహము', 'జీవుడు', 'పరమాత్మ' అని మూడు తత్త్వాలు ఉన్నాయి.

**జీవ + ఆత్మ = జీవాత్మ**
**దేహ + ఆత్మ = దేహాత్మ**
**పరమ + ఆత్మ = పరమాత్మ**

జీవ, దేహ, పరమ అని మూడూ వేరువేరుగా కనబడుతున్నాయిగాని, ఆత్మ మూడింటియందు ఒక్కటిగానే ఉంటున్నది.

**ప్రపంచవాసనలతో నిండినవారికి ఆత్మతత్త్వము గోచరించదు**

ప్రేమస్వరూపులారా! మీరింతవరకు పోనక్కర్లేదు. చిన్నచిన్న విషయాలలో కూడా మనము విచారణ చేస్తే సత్యమన్నది సులభముగా అర్థమవుతుంది. అనేకమంది నా దగ్గరకు వస్తుంటారు. 'స్వామీ! ఐ వాన్ట్ పీస్' అని అంటుంటారు. ఇక్కడ మూడు పదములుంటున్నాయి. 'ఐ' అంటే ఈగో. దీనిని తీసేసెయ్. వాన్ట్ అంటే కోరిక. దీనినికూడా తీసేసెయ్. ఇంక మిగిలినది పీస్ (శాంతి). నీవు ఈగోను, డిజైర్‌ను ప్రక్కన పెట్టుకొని 'పీస్, పీస్' అంటే అది ఏవిధముగా లభిస్తుంది? కనుక, మనము ఆధ్యాత్మిక విషయములలోకూడా సరియైన రీతిగా

అద్వైతభావముతో యోచన చేస్తే ఆత్మతత్త్వము ఎంత సులభమైనదో, ఎంత సున్నితమైనదో, ఎంత పవిత్రమైనదో, ఎంత గౌరవమైనదో మనకు సులభముగా అర్థమవుతుంది. అయితే, ప్రపంచ వాసనలలో నిండినవారికి విషయములు అర్థము కావు. దీనికి ఒక చిన్న ఉదాహరణము.

**ఫలములోని రసము తరువులు తామెరుగునా?**
**పువ్వులలోని పరిమళము తీగలనుభవించునా?**
**కావ్యాలలోని మధుర రసము గ్రంథములనుభవించునా?**
**నివృత్తి సార పాండిత్యము ప్రవృత్తి పండితుడెట్లెరుగును?**

చెట్టునిండా కాయలు కాస్తున్నాయి. కాని, ఆ ఫలముయొక్క మాధుర్యము చెట్టుకేమాత్రము తెలియదు. పుష్పములోని పరిమళము తీగకు ఏమాత్రము తెలియదు. దివ్యమైన మానవత్వము ప్రతి మానవునియందు వెంట, జంట ఉన్నప్పటికీ దీని తత్త్వము మానవునికి అర్థము కావడం లేదు.

మనము ఆత్మతత్త్వము నిమిత్తమై అన్నింటినీ ఆశ్రయించనవసరము లేదు. అందరివద్దకూ పోనక్కర్లేదు. అయితే, ఈ విషయాన్ని తెలుసుకొనే నిమిత్తమై విషయము తెలిసిన మహనీయులదగ్గరకు వెళ్ళి కొంతవరకు తెలిసికొని నీకు నీవే సాధనలు సలుపుకోవాలి. విచారణ చేయాలి. గురువు చెప్పగలడేగాని, చేయవలసినది నీవే. బిడ్డ అంటే తల్లికి ప్రేమ. బిడ్డకు మాటలు నేర్పించాలంటే, తల్లి పలికి బిడ్డచే పలికించాలని ప్రయత్నిస్తుందే గాని, తల్లి నోరు బిడ్డ నోటిలో పెట్టి పలుకదు. మన వేద, శాస్త్ర, పురాణ, ఇతిహాసములు పవిత్రమైన విషయాలను బోధిస్తాయి. కాని, గ్రంథములను పఠించినంతమాత్రమున లాభము లేదు. వాటిని ఆచరణలో పెట్టాలి.

మొట్టమొదట ఇంద్రియముల ఉద్రేకతను మనము చంపాలి. దీనికొరకు అనేకమంది కొంతవరకు ఆహారాన్ని కంట్రోలు చేస్తుంటారు. ఇది కేవలము వెఱ్ఱితనము; అజ్ఞానముయొక్క లక్షణము. ఇది కాదు ప్రధానము. సత్యాన్ని తెలుసుకున్న తరువాత ఉద్రేకములు తమంతట తామే నిలచిపోతాయి.

**“పుట్టపై మర్దించిన పాము మరణమొందునా?**
**తనువును తా దండించిన విషయభోగములుడుగునా?**
**ఆకలి దప్పులు మానినంత ఆత్మజ్ఞాని తానగునా?**
**తానెవరో తెలియకున్న తత్త్వజ్ఞానమెట్లు కలుగు?”**

మొట్టమొదట తానెవరో తెలుసుకోవడానికి ప్రయత్నించకుండా ఏమి చేసినా లాభము లేదు.

**వ్యక్తిత్వమును బ్రహ్మతత్త్వములో ఐక్యము గావించు**

ప్రేమస్వరూపులారా! మానవత్వము అజ్ఞానాంధకారములో మునగడము చేత నీటిబిందువు మాదిరి ఉంటున్నది. తన ప్రేమకూడా సంకుచితమై, స్వార్థపూరితమై కేవలము అణుప్రమాణముగా ఉంటున్నది. తను, తనవారు తప్ప ఇతరులను ప్రేమించే విశాలత్వము ఉండడం లేదు. కాని, దైవత్వముయొక్క ప్రేమ విశాలమైన సముద్రమువంటిది. ఈ సముద్రము దగ్గరికి వెళ్ళి, నీటి బిందువు తనను సముద్రముతో పోల్చుకోవడానికి ఏమాత్రమైనా సాధ్యమవుతుందా? ఈ ప్రయత్నము చీమ స్వర్గానికి పోయేటట్లుగా ఉంటుంది. దీనివలన సత్యమును ఏమాత్రము గ్రహించ లేవు. అయితే, నీవు సముద్రముయొక్క స్వరూపమును పొందాలంటే మరొక మార్గమును అవలంబించు. నీవు కేవలము ఒక బిందు మాత్రమైనప్పటికీ ఆ బిందువును సముద్రములో చేర్చు. అప్పుడే రెండూ ఒకటైపోతాయి. ‘బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి’. బిందువులను వేరువేరుగా ఉంచుకొని సముద్రమును వర్ణించడానికి ప్రయత్నిస్తే లాభము లేదు. భగవంతుని తెలుసుకోవడానికి ఏమాత్రము సాధ్యము కాదు. నీ తత్త్వాన్ని

బ్రహ్మతత్త్వములో ఐక్యము కావించు. అప్పుడు రెండూ ఏకమైపోతాయి.

ఈవిధమైన ఐక్యతకు మానవుడు పాటుపడాలిగాని, 'నాకు నేనే, నీకు నీవే' అనుకుంటే దానివలన సమత్వముగాని, ఆనందముగాని లభించుట కల్ల, కల్ల, కల్ల. అయితే, ఈ ఆత్మతత్త్వాన్ని తెలుసుకోవడానికి మరొక ఆత్మ కావాలా? అని కొంత సందేహముండవచ్చును. ఇదికూడా కొంతవరకు అజ్ఞానమే. దీపమెక్కడ వెలుగుతున్నదో తెలుసుకోవడానికి ఇంకొక దీపమును తీసుకోవాలా? దీపమే వెలుగుతుంటే దానిని చూడడానికి ఇంకొక దీపమెందుకు? ఆత్మతత్త్వము స్వప్రకాశమై వెలుగుతుంటుంది. రాత్రియందు చంద్రుడు వెలుగుతుంటే, టార్చిలైటో, పెట్రోమేక్సు లైటో తీసికొని దాని సహాయంతో చంద్రుని చూడబోవడం ఎంత వెఱ్ఱితనము! చంద్రుని వెలుతురు ఆధారముగనే చంద్రుని చూడాలి. ప్రేమస్వరూపుడు ప్రకాశిస్తున్నాడు. ఆ ప్రకాశమును ఆధారము చేసుకొనియే ఆ ప్రేమ స్వరూపుని పొందాలి. వేరే మార్గమును అనుసరించితే మనము ఆ స్థానమునుగాని, ఆ గుణమును గాని పొందలేము.

**అజ్ఞానముచేతనే దుఃఖము ప్రాప్తించుచున్నది**

ఆత్మ అణుస్వరూపమై అన్ని పదార్థములందు ప్రకాశించడంచేత సర్వ పదార్థములూ ఆత్మకు స్వరూపములుగా నిలుస్తాయి. కనుకనే, వేదము నందు 'ఈశ్వర స్సర్వ భూతానాం', 'ఈశావాస్య మిదం సర్వం' అని చెప్పబడింది. సర్వత్రా ఈశ్వరత్వమున్నదనే దానిని మనం గుర్తించుకోవాలి. ఇది గుర్తించుకుని వాక్యములో పెట్టినంతమాత్రమున ప్రయోజనము లేదు. దానిని ఆచరించడానికి, అనుభవించడానికి ప్రయత్నము చేయాలి. తాదాత్మ్య భావమును పొందాలి. ఒక గురువు శిష్యునకు 'శివోహం... శివోహం' అనే మంత్రాన్ని ఉపదేశించాడట. అలాగే ఆ శిష్యుడు 'శివోహం... శివోహం' అని నిరంతరం ఉచ్చరించేవాడు. ఒకనాడు అతని దగ్గరకు ఒక మిత్రుడు వచ్చి, "ఏమయ్యా, ఎప్పుడూ శివోహం... శివోహం.. అంటుంటావు. దీనికి అర్థమేమిటి?" అని ప్రశ్నించాడు. ఆ శిష్యుడు, 'నేనే శివుడు, నేనే శివుడు' అని జవాబు చెప్పాడు. మంత్రానికి అర్థమైతే చెప్పాడు గాని, ఈ విశ్వాసము అతనిలో దృఢముగా ఉండాలి కదా! అప్పుడు ఆ వచ్చిన మిత్రుడు "అయితే, నీకు పార్వతీ దేవి ఏమి కావాలి?" అని ప్రశ్నించాడు. వెంటనే ఈ శిష్యుడు, "అపరాధం, అపరాధం" అన్నాడట. నిజముగా, తానే శివుడైతే, పార్వతి తన అర్ధాంగి అని చెప్పే ధైర్యము ఎందుకు లేదు? పదముల అర్థము తెలుసుకొని దానిని తాదాత్మ్య భావములో పెట్టకపోయినప్పుడు తాను శివత్వమును ఉచ్చరించి ఏమి ప్రయోజనము? ఈ అజ్ఞానముచేతనే మనకు దుఃఖము ప్రాప్తించుచున్నది. ఈ అజ్ఞానము చేతనే జన్మ ప్రాప్తించుచున్నది. ఇది నిర్మూలనము కావాలంటే, "జ్ఞానా దేవతు కైవల్యం", మనము జ్ఞానతత్త్వాన్ని పొందాలి.

**నిర్మల, నిస్వార్థ సేవాభావమును మీరు పెంపొందించుకున్ననాడే భగవంతుని పుట్టిన దినము**

ప్రేమస్వరూపులారా! దైవమునకు జన్మదినమనేటటువంటిది ప్రత్యేకంగా లేదు. కనుక, ఏనాడు మీ హృదయాలలో పవిత్రమైన భావములు అభివృద్ధిపరచుకొందురో, ఏనాడు నిర్మల నిస్వార్థ సేవా భావమును మీరు హృదయములో ప్రతిష్ఠ చేసుకొందురో ఆనాడే భగవంతుడు పుట్టిన దినముగా భావించుకొని, ఆనాటినుండి జన్మదినములు చేసుకోవడానికి ప్రయత్నించండి. మీరు విన్న విషయాలను, తెలిసికొన్న విషయాలను కొన్నింటినైనా ఆచరణలో ఉంచి, తద్ద్వారా మీరు ఆదర్శ ప్రాయులై, భారతదేశముయొక్క పవిత్ర సంస్కృతిని ఆచరణపూర్వకముగా ప్రచార ప్రబోధలు సల్పి, తద్ద్వారా భారతీయ సంస్కృతిని పునరుద్ధరిస్తారని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.